





# కలం కౌంటర్

KALAM COUNTER TELUGU DAILY

తెలుగు దినపత్రిక

సంపుటి : 9 సంచిక : 296

పేజీలు : 4 వెల రూ.4/-

**Circulated by :** Krishna, Guntur, Prakasam, Nellore, West Godavari, Khammam, Hyderabad, Chittor

శనివారం 11 ఏప్రిల్ 2026



# ముగిసిన ఏపీ కేబినెట్ సమావేశం... పలు అంశాలపై కీలక నిర్ణయాలు



**అమరావతి,కలంకౌంటర్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశం ముగిసింది. సచివాలయంలో సుమారు మూడున్నర గంటల పాటు సాగిన ఈ సమావేశంలో 60 అంశాల ఎజెండాపై విస్తృతంగా చర్చించి పలు కీలక నిర్ణయాలకు ఆమోదం తెలిపారు. రాష్ట్ర రాజధాని అమరావతికి చట్టబద్ధత కల్పించడం, భారీ పెట్టుబడులను ఆకర్షించడం, ఉన్నత విద్యలో సంస్కరణలు వంటి ముఖ్యమైన అంశాలపై కేబినెట్ దృష్టి సారించింది. సమావేశంలో ప్రధానంగా, అమరావతికి చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్ర పునర్విభజన చట్టానికి సవరణ చేసినందుకు గాను ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి, కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలుపుతూ ఏకగ్రీవంగా తీర్మానం చేసింది. అమరావతి బిల్లుకు పార్లమెంటులో మద్దతిచ్చిన అన్ని పార్టీలకు కూడా కేబినెట్ కృతజ్ఞతలు తెలిపింది. ఈ అంశాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మంత్రులకు సూచించారు. రాష్ట్ర ఆర్థిక ప్రగతికి ఊతమిచ్చేలా, 16వ రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి (SIPB) సమావేశంలో చర్చించిన రూ.39 వేల కోట్లకు పైగా విలువైన పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది. ఈ పెట్టుబడుల ద్వారా రాష్ట్రంలో కొత్త పరిశ్రమలు ఏర్పాటై, యువతకు పెద్ద ఎత్తున ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో పాటు, విశాఖపట్నంలోని క్వాంటం వ్యాలీలో మూడు సంస్థల ఏర్పాటుకు కూడా మంత్రివర్గం పచ్చజెండా ఊపింది. ఈ నెల 14న క్వాంటం కంప్యూటర్స్‌కు సంబంధించిన శంకుస్థాపన కార్యక్రమానికి కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. ఉన్నత విద్యారంగంలో ఫీజుల నియంత్రణపై ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రైవేట్ కాలేజీలు, యూనివర్సిటీలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేయకుండా నిరోధించేందుకు ప్రస్తుతం ఉన్న విద్యా కమిషన్ స్థానంలో ఫీజ్ రెగ్యులేటరీ కమిటీ (ఫీ=జ)ని ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఇందుకు సంబంధించి యూనివర్సిటీల చట్ట సవరణపై కూడా సమావేశంలో చర్చించారు. వీటితో పాటు పలు సంస్థలకు భూ కేటాయింపులకు సంబంధించిన ప్రతిపాదనలకు కూడా కేబినెట్ ఆమోదం తెలిపింది. అధికారిక ఎజెండా ముగిసిన తర్వాత, తాజా రాజకీయ పరిణామాలపై కూడా చర్చ జరిగింది. అమరావతి విషయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాలను ఎప్పటికప్పుడు సమర్థవంతంగా తిప్పికొట్టాలని సీఎం చంద్రబాబు మంత్రులకు దిశానిర్దేశం చేశారు. వచ్చే జూన్‌తో కూటమి ప్రభుత్వానికి రెండేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో, ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించాలని, ఎమ్మెల్యేలతో సమన్వయం చేసుకుంటూ శాఖలపై పట్టు సాధించి చురుకుగా పనిచేయాలని సూచించారు.

# ప్రపంచ సాంకేతిక పటంలో ఏపీకి నవశకం

**● క్వాంటం డీప్ టెక్ లో అజేయ శక్తిగా అమరావతి ● ఏప్రిల్ 14 తేదీన ప్రారంభం క్వాంటం టెస్టింగ్ రిఫరెన్స్ ఫెసిలిటీ ● మేధాటవర్స్, ఎస్ఆర్ఎం నుంచి పనిచేయనున్న 1ఎస్, 1క్యూ క్వాంటం టెస్ట్ బెడ్స్ ● డ్రగ్ డిస్కవరీ, వెదర్ మోడలింగ్ సహా వివిధ పరిశోధనలు, ఆవిష్కరణల కేంద్రంగా అమరావతి క్వాంటం వ్యాలీ ● దేశంలోనే తొలిసారి స్వదేశీ తయారీ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీని ప్రారంభించనున్న ముఖ్యమంత్రి చంద్రబాబు**




**అమరావతి, కలంకౌంటర్ :** నవశకం సాంకేతికత క్వాంటం టెక్నాలజీలో గ్లోబల్ లీడర్ గా అమరావతి ఎదుగుతోంది. నేషనల్ క్వాంటం మిషన్ లక్ష్యాలను అందిపుచ్చుకుని దేశంలోనే తొలి క్వాంటం కంప్యూటింగ్ కేంద్రంగా రూపు దిద్దుకుంటోంది. క్వాంటం టెక్నాలజీలో పరిశోధనలు, ఆవిష్కరణల దిశగా అవసరమైన ఎకోసిస్టం సిద్ధమవుతోంది. మూడు దశాబ్దాల క్రితం ఐటీ విప్లవానికి నాంది పలికిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఇప్పుడు క్వాంటం టెక్నాలజీ తో ఆంధ్రప్రదేశ్‌ను భవిష్యత్ ప్రపంచానికి చిరునామాగా మారు-స్తున్నారు. ఏప్రిల్ 14, ప్రపంచ క్వాంటం దినోత్సవాన్ని పురస్కరించుకుని ముఖ్యమంత్రి అమరావతిలో దేశంలోనే మొట్టమొదటి స్వదేశీ క్వాంటం కంప్యూటర్ల టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీని సీఎం ప్రారంభించనున్నారు. గన్నవరంలోని మేధాటవర్స్ తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ లో 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలు ప్రారంభం కానున్నాయి. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్సు ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. ఈ స్వదేశీ నిర్మిత క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీలు అమరావతిని ఓ అత్యాధునిక క్వాంటం ఎకోసిస్టమ్ గా తీర్చిదిద్దనున్నాయి. పూర్తి స్వదేశీ టెక్నాలజీతో భారత్ లోనే తొలిసారి క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్ ను పరీక్షించే సౌకర్యాన్ని అమరావతిలో ఏర్పాటు చేశారు. అమరావతి 1Q పేరిట మినీ క్వాంటం కంప్యూటింగ్ టెస్టింగ్ ఫెసిలిటీని గన్నవరంలోని మేధా టవర్స్‌లో ఏర్పాటు చేశారు. అమరావతి 1ఎ పేరిట రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో విద్యార్థులు, పరిశోధకుల కోసం ఇది 'ఓపెన్ యాక్సెస్' ప్రాతిపదికన మరో క్వాంటం రిఫరెన్సు టెస్ట్ ఫెసిలిటీని తీర్చిదిద్దారు. క్వాంటం కంప్యూటింగ్ ప్రక్రియను ప్రత్యక్షంగా వీక్షించేలా ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీగా దీనిని ఏర్పాటు చేశారు.

**క్వాంటం హార్డ్‌వేర్ తయారీలో కీలకం..** మేధాటవర్స్ సహా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్ లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో క్వాంటం కంప్యూటర్లు

- 2లో

# భోగాపురం విమానాశ్రయం ప్రారంభోత్సవానికి మోదీకి ఆహ్వానం!



**అమరావతి,కలంకౌంటర్ :** ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల కల, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టు అయిన భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం (అల్లూరి సీతారామ రాజు అంతర్జాతీయ విమానాశ్రయం) ప్రారంభోత్సవానికి ముహూర్తం ఖరారవుతోంది. ఈ మెగా ప్రాజెక్టును జాతికి అంకితం చేయాల్సిందిగా కోరుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రధానమంత్రి మోదీకి అధికారికంగా ఆహ్వానం పంపారు. ప్రధాని షెడ్యూల్ లభ్యతను బట్టి జూలై 5 లేదా 8వ తేదీల్లో ఒక రోజును, లేనిపక్షంలో ఆగస్టు 17 లేదా 19 తేదీల్లో మరొక తేదీని ప్రారంభోత్సవానికి కేటాయించాలని ఏపీ ప్రభుత్వం విజ్ఞప్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం ఈ విమానాశ్రయ పనులు తుది దశకు చేరుకున్నాయి. సుమారు 98 శాతం పనులు ఇప్పటికే పూర్తవ్వగా, మిగిలిన ఫినిషింగ్ పనులను జూన్ 30వ తేదీ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం అదనపు సిబ్బందిని మోహరించి రాత్రింబవళ్లు యుద్ధ ప్రాతిపదికన పనులు కొనసాగిస్తున్నారు. ఈ అంతర్జాతీయ విమానాశ్రయం అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర రూపురేఖలు మారిపోవడమే కాకుండా... పర్యాటక, పారిశ్రామిక రంగాలు కొత్త పుంతలు తొక్కుతాయని నిపుణులు భావిస్తున్నారు. ఇప్పటికే ఈ విమానాశ్రయాన్ని కస్టమ్స్ ఎయిర్‌పోర్ట్‌గా కేంద్రం నోటిఫై చేయగా, అంతర్జాతీయ విమానాల రాకపోకలకు అవసరమైన ఇమ్మిగ్రేషన్ హోదాను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఏపీ ప్రభుత్వం కేంద్రాన్ని కోరింది.

# ప్రేమోన్మాదిని కఠినంగా శిక్షిస్తాం - కడప జిల్లా ఇన్చార్జి మంత్రి సవిత



**అమరావతి,కలంకౌంటర్ :** కడప జిల్లా ఖాజీపేటలో విద్యార్థిని బలిగొన్న ప్రేమోన్మాది ఘాతుకంపై జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. ఎంతో భవిష్యత్తు కలిగిన యువతి హత్యకు గురికావడం మనస్సును కలిచి వేస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. నిందితుడు ఎంతటివాడైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మహిళలు, బాలికలపై పట్ల ఉన్మాదిలా వ్యవహరిస్తే ఉక్కుపాదంతో అణిచివేస్తామన్నారు. ఈ మేరకు శుక్రవారం ఇన్చార్జి మంత్రి సవిత ఒక ప్రకటన విడుదల చేశారు. పెళ్లి చేసుకోవాలంటూ, యువతి ఇంటికి వెళ్లి గొంతు కోయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు. విచక్షణ మరిచి, ఎంతో భవిష్యత్తు కలిగిన యువతిని బలి కొనడం దారుణమన్నారు. నిందితుడు శ్రీనివాస్ క్షమించరాని నేరం చేశాడన్నారు. ప్రేమోన్మాదికి చట్టపరంగా కఠినంగా శిక్షిస్తామన్నారు. యువతి కుటుంబానికి సానుభూతి వ్యక్తం చేసిన మంత్రి సవిత, అండగా ఉంటామన్నారు. భవిష్యత్తులో మరెవరూ మహిళలు, బాలికల వైపు కన్నెత్తు చూడకుండా ఉండేలా చట్టపరంగా నిందితుడిని శిక్షిస్తామన్నారు. మహిళల పట్ల సైకోల్లా ప్రవర్తిస్తే వారికి అదే చివరి రోజని హెచ్చరించారు. యువత బాధ్యతతో మెలుగుతూ, డ్రగ్స్ కు, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మగ బిడ్డల విషయంలో తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పుడూ వారిపై ఓ కన్నేసి ఉంచాలని అన్నారు. నైతిక విలువలతో కూడిన జీవనం సాగించేలా చూడాలని మంత్రి సవిత సూచించారు.

# అమరావతిలో విద్యుత్ పనులు వేగవంతం చేయాలి: మంత్రులు గొట్టిపాటి, నారాయణ ఆదేశం



**అమరావతి,కలంకౌంటర్ :** అమరావతి రాజధాని ప్రాంతంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవి కుమార్, పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులకు ఆదేశించారు. సచివాలయంలో సీఆర్డీఏ, విద్యుత్ శాఖ అధికారులతో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి సీఆర్డీఏ కమిషనర్ విజయరామరాజు, సీపీడీసీఎల్ సీఎండీ పుల్లారెడ్డిలతో పాటు ఇరు శాఖలకు సంబంధించిన ఇతర అధికారులు హాజరయ్యారు. రాజధాని పరిధిలో చేపట్టిన విద్యుత్ శాఖ పనుల పురోగతిపై ఇరువురు మంత్రులు సమగ్రంగా చర్చించారు. పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా వేగంగా పూర్తి చేయాలని మంత్రులు గొట్టిపాటి, నారాయణ అధికారులను ఆదేశించారు. మాస్టర్ ప్లాన్‌లో ఎలాంటి మార్పులు చేయకుండా విద్యుత్ నిర్మాణ పనులు కొనసాగించాలని సూచించారు. ము-ఖ్యంగా హైటెన్షన్ లైన్ల మార్పిడి పై ఇరు శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి పనులను సమయానికి పూర్తి చేయాలని దిశానిర్దేశం చేశారు. అలాగే, న్యాయమూర్తులు, మంత్రులు, ప్రజాప్రతినిధులు, అఖిల భారత సర్వీసు అధికారుల నివాసాలకు నిరంతర విద్యుత్ సరఫరా అందేలా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై కూడా సమావేశంలో చర్చించారు. రాజధాని అభివృద్ధిలో విద్యుత్ మౌలిక వసతులు కీలకమని, వాటి నిర్మాణం నాణ్యతతో పాటు సమయపాలనతో పూర్తి కావాలని మంత్రులు తెలిపారు.

# యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలి

**● ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలి ● ఏం నేర్చుకున్నారన్నది కాదు.. ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యం ● షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం ● ఎవరూ చూడనప్పుడు మీరేం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం ● ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామ్యం కాబోతోంది ● గ్రీన్ ఉడ్ హై సంస్థ గ్లోబల్ సిటిజన్స్ ను తయారుచేస్తుండటం గర్వకారణం ● బెంగళూరు గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో మంత్రి నారా లోకేష్**





**బెంగళూరు,కలంకౌంటర్ :** యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలని, ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. బెంగళూరు సర్జాపూర్ లో ప్రముఖ రియల్ ఎస్టేట్ సంస్థ సత్వా గ్రూప్ ఆధ్వర్యంలోని గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ(ఐబీ డిప్లమా ప్రోగ్రామ్) గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో(2026) మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ... ఈ రోజు కేవలం గ్రాడ్యుయేషన్ డే వేడుక మాత్రమే కాదు. జ్ఞాపకాలు కలలను కలిసే చోటు, విద్యార్థులు భవిష్యత్ నాయకులుగా మరే ప్రత్యేకమైన క్షణం. ఈ కార్యక్రమానికి నన్ను ఆహ్వానించడానికి పాఠశాల బృందం వచ్చినప్పుడు.. ఈ ఏడాది గ్రాడ్యుయేషన్ థీమ్ 'కొత్త అవకాశాలకు నాంది పలకడం'(Pioneering Possibilities) అనే థీమ్ ను విద్యార్థులే ఎంచుకున్నారని చెప్పడం నాకు ఆశ్చర్యంతో పాటు ఆనందాన్ని కలిగించింది. ఇది చాలు మీరేంటో చెప్పడానికి. ఎందుకంటే ఇది కేవలం థీమ్ మాత్రమే కాదు.. ఒక ఆలోచనా విధానం. మీలో ఉన్న ధైర్యాన్ని, జిజ్ఞాసను ప్రతిబింబిస్తోంది. 'తర్వాత ఏమిటి' (వాట్స్ నెక్స్ట్?) అని అడగడానికి భయపడని తరం, మరీ ముఖ్యంగా 'ఎందుకు కాదు?' (Why Not) అని ప్రశ్నించే తరం. నేటి ప్రపంచానికి అవసరమైనది కూడా అదే.

**గ్రీన్ ఉడ్ హై సంస్థ గ్లోబల్ సిటిజన్స్ ను తయారుచేస్తుండటం గర్వకారణం..** గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ వంటి సంస్థలను నిర్మించడంలో సత్వా గ్రూప్ పాత్ర అభినందనీయం. ఈ రోజు సత్వా గ్రూప్ ఏపీ, విశాఖ అభివృద్ధిలో భాగస్వామ్యం కాబోతోంది. అలా ఈ అనుబంధం ప్రారంభమైంది. అందుకే ఈ రోజు మీ ముందుకు వచ్చి మాట్లాడే అవకాశం నాకు లభించింది. ఈ క్యాంపస్‌ను, మీ మౌలిక సదుపాయాలను, మీ విజయాలను, మీ ప్రపంచ దృష్టిని చూసినప్పుడు.. గ్రీన్‌వుడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ వంటి సంస్థలు అత్యున్నత ప్రమాణాలతో గ్లోబల్ సిటిజన్స్ ను తయారు చేస్తున్నాయని గర్వంగా అనిపిస్తోంది.

**ఏం నేర్చుకున్నారన్నది కాదు.. ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యం..** ఇక్కడకు రావడం వల్ల నా పాత రోజులు గుర్తుకువస్తున్నాయి. నేను కార్నెగీమెలన్ యూనివర్సిటీలో, తర్వాత స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో చదివిన రోజుల్ని గుర్తు చేసుకుంటున్నాను. అవి కలలు, ఆశయాలు, అనిశ్చితితో నిండిన రోజులు. కానీ నేను ఎంతో స్పష్టంగా నేర్చుకున్న ఒక విషయం ఉంది. విద్య అనేది మీరు ఏం నేర్చుకుంటారన్నది మాత్రమే కాదు. మీరు ఎలా ఆలోచించడం నేర్చుకుంటారన్నదే ముఖ్యం. అదే విషయం నాకు ఇక్కడ కూడా కనిపిస్తోంది. పరీక్షల కోసం మాత్రమే కాదు, జీవితానికి సిద్ధం చేసే ఒక విధానం.

**ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలి..** మీలో ఎంతమంది డాక్టర్లు, ఇంజనీర్లు, కావాలనుకుంటున్నారు? మీలో ఎంతమంది ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాల వైపు చూస్తున్నారు? ఎంతమంది వ్యాపారవేత్తలు, రాజకీయ నాయకులు కావాలనుకుంటున్నారు? మీరు ఏ దారిని ఎంచుకున్నా ఒక విషయాన్ని గుర్తుంచుకోండి. ట్రెండ్స్‌ను అనుసరించకండి, మీ లక్ష్యాన్ని అనుసరించండి. ఎందుకంటే ట్రెండ్స్ మారిపోతాయి... కానీ లక్ష్యం మాత్రం నిలిచే ఉంటుంది. ఎప్పుడూ ఇతరులు నడవని దారినే ఎంచుకోండి.

**యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలి..** మీరు నన్ను ఈ రోజు ఒక మంత్రిగా చూస్తున్నారు. కానీ జీవితం ఎప్పుడూ ఒకేలా ఉండదు. 2017-19 వరకు నేను పంచాయతీరాజ్, ఐటీ & ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ శాఖ మంత్రిగా పనిచేశాను. ఒక గదిలో కూర్చొని నిర్ణయం తీసుకుంటే.. ఎక్కడో దూరంగా ఉన్న గ్రామంలో, ఎవరో ఒకరి జీవితం మారిపోతుంది. అదే రెస్పాన్స్ బులిటీ పవర్. ఒక్కోసారి జీవితం మనల్ని పరీక్షిస్తుంది కూడా. 2019 ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచి పోటీ చేసి ఓడిపోయాను. దాదాపు నాలుగు దశాబ్దాలుగా తెలుగుదేశం పార్టీ గెలవని నియోజకవర్గం అది. ఆ సవాల్ ను స్వీకరించా. కానీ ఓడిపోయా. ఆ క్షణం ఎంతో బాధపడ్డా. ఆ ఓటమి నాలో కసి పెంచింది. వెనక్కి తగ్గకూడదని నిర్ణయించుకుని ముందుకు సాగాను. 2023లో ఏపీ వ్యాప్తంగా 3,132 కిలోమీటర్లకు పైగా యువగళం పేరుతో పాదయాత్ర

# న్యాయ శాఖ పటిష్టత కోసం చర్యలు

## -పబ్లిక్ లిటిగేషన్ పాలసీ- 2025పై మంత్రి వర్గ ఉపసంఘం భేటి





**అమరావతి,కలంకౌంటర్ :** రాష్ట్రంలో న్యాయ శాఖ పటిష్టత కోసం ప్రణాళికబద్ద చర్యలు తీసుకునేందుకు కార్యాచరణ చేపట్టినట్లు రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ పేర్కొన్నారు.ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం- 2025" (ఏపీ స్టేట్ పబ్లిక్ లిటిగేషన్ పాలసీ ) ను పరిశీలించడానికి ఏర్పాటైన మంత్రివర్గ ఉప సంఘం శుక్రవారం భేటీ అయింది. వెలగపూడి సచివాలయం లో రాష్ట్ర న్యాయ మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్, హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత,వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ లు న్యాయశాఖ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించారు. న్యాయ శాఖ లోతప్పనిసరి వ్యాజ్యాలను తగ్గించడం, సకాలంలో ప్రభావవంతమైన వివాద పరిష్కారాన్ని నిర్ధారించడం,పారదర్శకత, జవాబుదారీతనం కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్న నేపథ్యంలో మంత్రివర్గ ఉప సంఘం ను రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా "ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజా వ్యాజ్య విధానం- 2025" పై పలు నిర్ణయాలను రూపొందించడంలో భాగంగా మంత్రులు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ మాట్లాడారు. అనవసరమైన వ్యాజ్యాలను తగ్గించడానికి, కేసుల పరిష్కార వేగవంతానికి, పాలన సామర్థ్యాన్ని మెరుగుపరచడానికి, పరిపాలనా స్థాయిలో వివిధ పద్ధతులను సమీక్షించి మంత్రుల సంఘం సూచనలు చేస్తుందని మంత్రి తెలిపారు.ముందస్తు కేసు నిర్వహణ ద్వారా అప్పీళ్లను న్యాయంగా దాఖలు చేయడానికి, విధానపరమైన జాప్యాలను తొలగించడానికి చర్యలను కూడా మంత్రుల సంఘం సూచిస్తుందని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వివాద పరిష్కారాన్ని సమీక్షించడం, ప్రోత్సహించడం,లోక్ అదాలత్‌లను సంస్థాగతీకరించడం తదితర అంశాలపై కూడా పూర్తి స్థాయిలో దృష్టి సారించి చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. న్యాయశాఖ ను మరింత పటిష్టం చేసేందుకు ప్రణాళిక బద్ధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టడం జరుగుతుందని న్యాయశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ స్పష్టం చేశారు. ఇతర రాష్ట్రాలలో ఇప్పటికే అమల్లో ఉన్న లిటిగేషన్ పాలసీని పరిశీలించి, అక్కడ చేపట్టిన చర్యలు, సంస్కరణలు, ఇతర అంశాలను కూలంకషంగా పరిశీలించి, మన రాష్ట్రంలో లిటిగేషన్ పాలసీని పటిష్టంగా అమలు చేయాలని మంత్రివర్గ ఉప సంఘం సమావేశంలో పాల్గొన్న మంత్రులు ఫరూక్, అనిత, సత్య కుమార్ లు సూచించారు. ఈ సమావేశంలో న్యాయశాఖ కార్యదర్శి ప్రతిభా దేవి, సిబ్బంది పాల్గొన్నారు.

# భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలి - కలెక్టర్ రాజాబాబు



**కందుకూరు, కలంకౌంటర్ :** రామయపట్నం పోర్టు అనుసంధానంగా ఏర్పాటు కానున్న పరిశ్రమలకు సంబంధించి చేపట్టిన భూసేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ పి. రాజాబాబు, అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ రాజాబాబు, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ హిమవంశీతో కలిసి ఉలవపాడు తహసిల్దార్ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఇండోసోల్ పరిశ్రమకు సంబంధించి ఉలవపాడు మండలం, కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియ పురోగతి, అలాగే మండలంలో రెవెన్యూ సమస్యలు, గ్రీవెన్స్ అర్జీలను పరిష్కరిస్తున్న తీరుపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. కరేడు గ్రామ పరిధిలో చేపట్టిన భూసేకరణ ప్రక్రియను మిషన్ మోడ్ లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవడంతో పాటు అందులో భాగంగా సర్వే ప్రక్రియను నెల రోజుల లోపు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. మొత్తం భూమి ఎంత ఉంది, అందులో పట్టా భూమి, ప్రభుత్వ భూమి, డికేటి భూమి ఎంత వుంది, అందులో ఇప్పటివరకు ఎంత భూమి సర్వే చేశారు తదితర వివరాలతో సంపూర్ణ నివేదిక రూపొందించడంతో పాటు రోజు వారీ లక్ష్యాలను నిర్దేశించుకుని త్వరితగతిన భు సేకరణ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. రెవిన్యూ సమస్యలను పరిష్కరించడంలో నిర్లక్ష్యం వహిస్తే సహించబోని స్పష్టం చేశారు. గ్రీవెన్స్ అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, వచ్చిన అర్జీ తిరిగి రీ ఓపెన్ కాకుండా అర్జీదారులకు సహేతుకమైన ఎండార్స్మెంట్ ఇవ్వాలని ఆదేశించారు. మండల పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపైనా కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో రామయపట్నం పోర్టు భూసేకరణ ఎస్డిసి లు శ్రీ నాగిరెడ్డి, శ్రీ నాసరయ్య, తహసిల్దార్ శ్రీ రవి శంకర్, సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గ్రామాల్లో సమస్యలపై పరిటాల శ్రీరామ్ కు వినతులు

- ప్రజా దర్బార్ లో రోడ్లు, స్మశాన వాటికలు, నీటి సమస్యలపై విజ్ఞప్తులు
- ప్రజల సమస్యలను ఓపిగ్గా విన్న శ్రీరామ్
- పింఛన్లపై ఆందోళన వద్దు.. త్వరలోనే మంజూరవుతాయన్న శ్రీరామ్
- ధర్మవరం మండలానికి చెందిన ముగ్గురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ





**ధర్మవరం,కలంకౌంటర్ :** తమ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలంటూ ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్ ఛార్జి పరిటాల శ్రీరామ్ కు ప్రజలు విజ్ఞప్తి చేశారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో ఆయన శుక్రవారం ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ గ్రామాలు, ధర్మవరం పట్టణానికి చెందిన ప్రజలు తరలివచ్చి తమ సమస్యలు చెప్పుకున్నారు. ఇందులో ప్రధానంగా ధర్మవరం మండలం మల్కాపురం గ్రామంలో నీటి సమస్యపై గ్రామస్థులు వినతి పత్రం అందజేశారు. గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని.. ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించాలని కోరారు. మల్కాపురం గ్రామంలో స్మశాన వాటిక, పంచాయతీ కార్యాలయం నిర్మాణంతో పాటు తాగునీటి సమస్య పరిష్కరించాలని కోరారు. ప్రస్తుతం ఉన్న నీటి ట్యాంక్ డ్యామేజ్ అయిందని ఆ స్థానంలో కొత్తది నిర్మించాలని.. ఒక బోర్ వేయించాలన్నారు. వీధి లైట్లు, సీసీ రోడ్లు వేయాలని విజ్ఞప్తి చేశారు. బడన్నపల్లి గ్రామంలో స్మశానవాటిక నిర్మించాలని గ్రామస్థులు అభ్యర్థించారు. వీధిలైట్లు లేక రాత్రి వేళ్లలో విష పురుగులు ప్రజల్ని కరిచే పరిస్థితి వస్తోందన్నారు. పోతుకుంటలో స్మశాన వాటిక మూడున్నర ఎకరాల్లో ఉన్నప్పటికీ అక్కడ ముళ్ల పొదలతో నిండిపోయి ఉందన్నారు. దీనిని శుభ్రం చేయించి కంచె వేయించాలన్నారు. అలాగే కమ్యూనిటీ భవనం నిర్మాణంతో పాటు సీసీ రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో కూడా సమస్యలు ఉన్నాయన్నారు. ఇటు ధర్మవరం పట్టణంతో పాటు వివిధ గ్రామాలకు చెందిన ప్రజలు వృద్ధాప్య, వికలాంగ పింఛన్లు కావాలంటూ వినతి పత్రాలు అందజేశారు. ఇటు చేనేత కార్మికులు కూడా తమకు పింఛన్ వచ్చేలా చూడాలని కోరారు. దీనిపై శ్రీరామ్ స్పందిస్తూ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను ఎంపీడీఓతో పాటు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఆ సమస్యలు పరిష్కారమయ్యేలా చొరవ తీసుకుంటామని హామీ ఇచ్చారు. మరోవైపు అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ త్వరలోనే కొత్త పింఛన్లు అందిస్తామన్నారు. చేనేతల పింఛన్లకు సంబంధించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవి కూడా వచ్చేలా చూస్తామన్నారు. దీనిపై ఎవరూ ఆందోళన చెందవద్దని శ్రీరామ్ అన్నారు.

**సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన శ్రీరామ్..** ధర్మవరం మండలానికి చెందిన ముగ్గురికి పరిటాల శ్రీరామ్ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. నడిమిగట్టుపల్లికి చెందిన వి.రాహుల్ నాయక్ కి రూ.25.58వేలు, కుణుతూరుకి చెందిన శ్రీజ రెడ్డికి రూ.25.79వేలు, పోతుకుంటకి చెందిన అల్లం వాణికి రూ.30,51వేలు మొత్తం రూ.81.88లక్షల చెక్కులు అందజేశారు. ధర్మవరం టీడీపీ కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ అనారోగ్య కారణాలతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్సలు పొంది ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న వారిని సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆదుకుంటున్నట్టు తెలిపారు. ఇప్పటికే ఎన్టీఆర్ వైద్య సేవల ద్వారా అన్ని ఆసుపత్రుల్లో ఆపరేషన్లు జరుగుతున్నాయన్నారు. దీనిపై ఎలాంటి అపోహలు అవసరం లేదని శ్రీరామ్ సూచించారు.

# వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ మరో ఏడాది(2026-27)పొడిగింపు

**అమరావతి, కలంకౌంటర్ :** రాష్ట్రంలోని వర్కింగ్ జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు అమలు చేస్తున్న వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ ను మరో ఏడాది అనగా 2026-27 కు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.ఈమేరకు శుక్రవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ జిఓఎంస్ సంఖ్య 43 ద్వారా ఉత్తర్వులు జారీ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో జిఓ ఎంస్ సంఖ్య 12 ద్వారా 2015లో అక్రిడేటెడ్ వర్కింగ్ జర్నలిస్టులు ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా అదే విధంగా ఫ్రీలాన్స్,వెటరన్ జర్నలిస్టులు మరియు వారి కుటుంబ సభ్యుల ఆరోగ్య పరిరక్షణకు ప్రభుత్వ ఉద్యోగుల ఆరోగ్య పథకం (EHS) మాదిరిగా వివిధ ఎంపానల్డ్ ఆసుపత్రుల ద్వారా గుర్తింపు పొందిన అన్ని ప్రభుత్వ మరియు ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల ద్వారా ఎటువంటి నగదు చెల్లించాల్సిన అవసరం లేకుండా క్యాస్ లెస్ వైద్య సేవలు అందించే లక్ష్యంతో వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్(జేనూ)ను ప్రవేశపెట్టడం జరిగింది.దీర్ఘకాలిక వ్యాధులు మరియు అత్యవసర శస్త్రచికిత్సలతో సహా ప్రభుత్వం నిర్ణయించిన వందలాది వైద్య విధానాలు (Therapies) ఈ పథకం కింద కవర్ చేయబడతాయి. కాలానుగుణంగా ఈపథకాన్ని ప్రతి ఏటా అనగా 2016-17 నుండి 2025-26 వరకూ పొడిగించడం జరిగింది.మరలా ఈవర్కింగ్ జర్నలిస్టుల కాంప్రెహెన్సివ్ హెల్తు స్కీమ్ ను మరో ఏడాది కాలానికి అనగా 2026-27 కు పొడిగించాలన్న సాధారణ పరిపాలన శాఖ(ఐఅండ్ పిఆర్)విజ్ఞప్తి మేరకు ప్రభుత్వం ఈనెల 1వ తేదీ నుండి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ పొడిగిస్తూ నిర్ణయం తీసుకుని ఆమేరకు ఉత్తర్వులు జారీ చేసింది. వర్కింగ్ జర్నలిస్టుల హెల్తు స్కీమ్ పొడింగింపు ఉత్తర్వులకు అనుగుణంగా వెంటనే తగిన చర్యలు తీసుకోవాల్సిందిగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ అధికారి డా.ఎన్టిఆర్ వైద్య సేవ ట్రస్ట్ మరియు సంచాలకులు సమాచార పౌర సంబంధాల శాఖ చర్యలు తీసుకోవాల్సిందిగా వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శి సౌరవ్ గౌర్ ఆఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# ఈ నెల 18న మన వారసత్వానికి ఘనమైన వెలుగు

- ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు
- వారసత్వాన్ని కాపాడుకుంటూ బలమైన భవిష్యత్తును నిర్మించే ప్రయత్నం
- హెరిటేజ్ ట్రెక్కింగ్, హెరిటేజ్ వాక్, కొండపల్లి బొమ్మల మేళా, వారసత్వానికి సంగీత ఝురి
- వినూత్న కార్యక్రమాలతో వారసత్వానికి పట్టంకట్టేందుకు చొరవ
- మీడియా సమావేశంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ






**విజయవాడ,కలంకౌంటర్ :** మన ఘనమైన వారసత్వాన్ని కాపాడుకుంటూ బలమైన భవిష్యత్తును నిర్మించే ప్రయత్నంలో భాగంగా ఈ నెల 18న ప్రపంచ వారసత్వ దినోత్సవం (ఔశీతీశ్రీస ఎవతీ఑ఫ్లవ ఖుఎ) సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామని, వినూత్న కార్యాచరణతో వారసత్వానికి పట్టంకట్టే ఈ చొరవను విజయవంతం చేద్దామని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా నిర్వహించే ప్రత్యేక కార్యక్రమాలపై కలెక్టర్ లక్ష్మీశ శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర పర్యాటక, ఎన్టీఆర్ జిల్లా అధికార యంత్రాంగం, జిల్లా పర్యాటక ప్రాధికార సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కనకదుర్గమ్మ వారి ఆలయంతో పాటు మొగల్రాజపురం గుహలు, అక్కన్న మాదన్న గుహలు, గాంధీ కొండ, కొండపల్లి ఖిల్లా.. ఇలా మన ఘన సాంస్కృతిక వారసత్వ సంపదకు ఎన్నో ప్రతీకలు ఉన్నాయని.. వీటిని కాపాడుకుంటూ భావితరాలకు విలువైన వెలకట్టలేని వారసత్వాన్ని బహుమతిగా ఇవ్వాల్సిన అవసరం ఉందని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

**హెరిటేజ్ ట్రెక్కింగ్ నుంచి సంగీత స్వర ఝురి వరకు:** ఈ నెల 18వ తేదీ ఉదయం కొండపల్లి ఖిల్లాపైకి హెరిటేజ్ ట్రెక్కింగ్ ఉంటుందని.. ఉదయం 6 గంటలకు ఇది ప్రారంభమవుతుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. అదేవిధంగా కొన్ని స్పోర్ట్స్ ఈవెంట్లు కూడా జరుగుతాయన్నారు. ఇండియన్ నేషనల్ ట్రస్ట్ ఫర్ ఆర్ట్ అండ్ కల్చరల్ హెరిటేజ్ (ఐఎన్‌టీఏసీహెచ్) భాగస్వామ్యంతో నగరంలో హెరిటేజ్ వాక్ కార్యక్రమాన్ని కూడా నిర్వహించనున్నట్లు తెలిపారు. కొండపల్లిలో కొండపల్లి బొమ్మలతో మేళా కూడా ఏర్పాటు చేయడం జరుగుతుందని.. ఇది మూడు రోజుల పాటు కొనసాగుతుందని వెల్లడించారు. వారసత్వ సంస్కృతి, ఆధునిక జెన్ జెడ్, పండగలు, సుస్థిర అభివృద్ధి తదితర అంశాలపై మార్చి 8న కొండపల్లి బొమ్మల పోటీ నిర్వహించడం జరిగిందని.. ఇందులోని విజేతకు కొండపల్లి బొమ్మల మేళా కార్యక్రమం సందర్భంగా రూ. లక్ష విలువైన బహుమతులు, సర్టిఫికెట్లు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. అదేవిధంగా 18వ తేదీ రాత్రి ఇందిరాగాంధీ మునిసిపల్ మైదానం పక్కన ఖాళీ స్థలంలో సంగీత ఝరితో వారసత్వానికి పట్టంకట్టే కార్యక్రమం జరుగుతుందని.. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకులు ఎస్‌పీ చరణ్, సునీత తదితరులు పాల్గొంటారని తెలిపారు. వారసత్వ ఔన్నత్యానికి ప్రతీకలుగా నిలిచే వారిని గుర్తించి, వారిని ఘనంగా సత్కరించడం జరుగుతుందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. వారసత్వ సంపదను భావితరాలకు అందించే బృహత్ సంకల్పానికి ప్రతిఒక్కరూ కలిసిరావాలని.. సమష్టి కృషితో విజయవంతం చేద్దామని పిలుపునిచ్చారు. ఈ ఒక్క సంవత్సరానికి పరిమితం కాకుండా వీటిని ఏటా నిర్వహించేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వివరించారు. సమావేశంలో ఇన్‌టాక్ విజయవాడ చాప్టర్ కన్వీనర్ సాయి పాపినేని, ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా పర్యాటక అధికారి ఎ.శిల్ప, కొండపల్లి బొమ్మల హస్తకళాకారుల సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# 11 మందికి గాను డ్యూటీలో ఉన్నది ఒక్కరే

- మోచర్ల సచివాలయాన్ని తనిఖీ చేసిన ఎమ్మెల్యే ఇంటూరి
- సిబ్బంది నిర్లక్ష్యంపై కలెక్టర్ కు ఎమ్మెల్యే ఫిర్యాదు



**కందుకూరు, కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం మోచర్ల గ్రామసచివాలయంలో 11 మంది సిబ్బంది పనిచేస్తుండగా... శుక్రవారం ఒక్కరు మాత్రమే డ్యూటీలో ఉన్నారు. మిగతా పదిమంది ఉదయాన్నే రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లిపోయారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీకి వెళ్లడంతో సిబ్బంది నిర్లక్ష్యం వెలుగు చూసింది. సచివాలయ ఉద్యోగులు విధులకు సక్రమంగా రావడం లేదని, తెట్టు గ్రామస్తులు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన... సచివాలయానికి ఆకస్మికంగా వెళ్లారు. ఆ సమయంలో డిజిటల్ అసిస్టెంట్ ఒక్కరే ఉన్నారు. పదిమందిలో ముగ్గురు మాత్రం, గుడ్లూరు ఎంపీడీవో కార్యాలయంలో సమావేశానికి హాజరైనట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే నాగేశ్వర రావు, మిగిలిన వారిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ... వారికి మెమోలు ఇవ్వాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఆ తర్వాత కలెక్టర్ రాజాబాబుకు, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ఎమ్మెల్యే నాగేశ్వరరావు ఫిర్యాదు చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న వారిపై చర్యలకు సిఫార్సు చేశారు.

# సోషల్ మీడియాలో నకిలీ ప్రొఫైల్స్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి - జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్ రాజు



**ఒంగోలు,కలంకౌంటర్ :** సాంకేతికత పెరుగుతున్న కొద్దీ కొత్త రకాల మోసాలు వెలుగులోకి వస్తున్నాయని, కొందరు సైబర్ నేరగాళ్లు ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్లకు నకిలీ ప్రొఫైల్స్ సృష్టించి ప్రజలను మోసం చేస్తున్నారని ఎస్పీ గారు తెలిపారు. ఈ తరహా నేరాలకు పాల్పడుతున్న వారు ముందుగా ఫేస్‌బుక్‌లోకి ప్రవేశించి, ప్రైవసీ సెట్టింగ్స్ లేని ఖాతాల వివరాలను సేకరించి, ఆ వ్యక్తుల పోస్టులు మరియు గుర్తింపు పరిశీలిస్తారు. అనంతరం ఆ ఖాతాల్లో ఉన్న ఫోటోలను డౌన్‌లోడ్ చేసి, వాటిని ప్రొఫైల్ ఫోటోలుగా ఉపయోగించి నకిలీ ఖాతాలు సృష్టిస్తారు. తర్వాత ఆ నకిలీ ఖాతాల ద్వారా ఫ్రెండ్స్ లిస్టులో ఉన్న వారికే మళ్లీ ఫ్రెండ్ రిక్వెస్టులు పంపుతారు. దీనివల్ల, ఎదుటి వారు అదే వ్యక్తి మరో ఖాతా తెరిచారని భావించి ఆ రిక్వెస్టులను అంగీకరిస్తున్నారని ఎస్పీ తెలిపారు. తర్వాత ఆ నకిలీ ఖాతాలను వినియోగిస్తూ కొన్నాళ్లు కొత్త ఫ్రెండ్స్‌తో చాటింగ్ చేసి, అనంతరం వివిధ కారణాలు చెబుతూ తమకు అత్యవసరంగా కొంత డబ్బు కావాలని, కొన్ని గంటల్లోనే తిరిగి ఇస్తామని చెప్పి తెలిసిన వారిని ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపాలని కోరుతున్నారని తెలిపారు. ఆ సందేశాలను నమ్మి నిజంగా అవసరమై డబ్బులు అడుగుతున్నారనే భావనతో వారు చెప్పిన ఆన్‌లైన్ చెల్లింపు యాప్‌లకు డబ్బులు పంపితే, వాటిని సైబర్ నేరగాళ్లు దోచుకుంటున్నారని, కాబట్టి ఫేక్ ప్రొఫైల్ మోసాల పట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ సూచించారు. ఫేసుబుక్, ఇన్స్టాగ్రామ్, ట్విట్టర్ అకౌంట్ ల ద్వారా డబ్బులు అడిగితే సంబంధిత వ్యక్తులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలి లేదా పోలీసులకు సమాచారం అందించాలి లేదా హెల్ప్ లైన్ నెంబర్ 1930 కు కాల్ చెయ్యాలని లేదా నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ www.cybercrime.gov.in లో ఫిర్యాదు చేయాలని జిల్లా ఎస్పీ ప్రజలకు సూచించారు.

# మాతా, శిశు మరణాలు నమోదు కాకుండా పటిష్ట చర్యలు


- వైద్య, ఇతర సేవల్లో నిబద్ధతే నిండు ప్రాణాలను కాపాడుతుంది
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, కలంకౌంటర్ :** జిల్లాలో మాతృ, శిశు మరణాలు సంభవించకుండా ఆశా కార్యకర్త నుంచి వైద్యాధికారి వరకు ప్రతిఒక్కరూ నిబద్ధతతో, క్రమశిక్షణతో సేవలందించాలని, ఇలా అందించే సేవలే నిండు ప్రాణాలను కాపాడుతాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. కలెక్టర్ లక్ష్మీశ.. శుక్రవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో మాతృ, శిశు మరణాల పర్యవేక్షణ, ప్రతిస్పందన కమిటీ సమీక్షా సమావేశం నిర్వహించారు. వైద్య ఆరోగ్య శాఖ, వైద్యాధికారులు, స్పెషలిస్ట్ వైద్యులు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ ప్రతి ప్రాణమూ అత్యంత విలువైనది.. తీసుకున్న చిన్నచిన్న జాగ్రత్తలే మాతాశిశు ప్రాణాలకు రక్షణగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఇప్పటికే నమోదైన మాతా, శిశు మరణాలకు కారణాలను విశ్లేషించి, ఇలాంటి కారణాలతో భవిష్యత్తులో మరణాలు చోటుచేసుకోకుండా సమగ్ర కార్యాచరణను రూపొందించి, అమలుచేయాలని ఆదేశించారు. మహిళలు గర్భం దాల్చిన నాటి నుంచి అవసరమైన అన్ని వైద్య పరీక్షలు చేయించుకునేలా గ్రామ స్థాయిలో ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని సూచించారు. వీరు తరచు గర్భిణీల ఇళ్లను సందర్శించి రక్తహీనత సమస్య ఏర్పడకుండా పౌష్టికాహారం, అవసరమైన మందులు తీసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. అంగన్వాడీ సిబ్బంది కూడా పోషకాహారం పరంగా సలహాలు సూచనలు ఇవ్వాలని, నిర్దేశించిన సరుకులు సకాలంలో అందేలా చూడాలన్నారు. రిజిస్ట్రేషన్ దగ్గరి నుంచి గర్భిణీల ఆరోగ్యం వివరాలను ఎప్పటికప్పుడు సక్రమంగా నమోదు చేయాలని, హైరిస్క్ ఉన్న గర్భిణులపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఎంహెచ్‌వో డా. ఎం.సుహాసిని, జిల్లా స్త్రీ శిశు సంక్షేమం, సాధికారత అధికారి షేక్ రుక్సానా సుల్తానా బేగం, వైద్య నిపుణులు, గైనిక్ హెచ్ ఓ డి కేశవ చంద్ర, పీడియాట్రిక్ ప్రొఫెసర్ డాక్టర్ సునీత, ప్రాక్సి నుండి డాక్టర్ రత్న, డాక్టర్ సౌజన్య, అదనపు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఇందుమతి దేవి, జిల్లా ఇమేజెస్ అధికారి డాక్టర్ శరత్ బాబు, వైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.



# ఆపన్నులను ఆదుకుంటాం



**ఉయ్యూరు,కలంకౌంటర్ :** అనారోగ్యంతో బాధపడుతున్న ఆపన్నులను ఆదుకోవడం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముందుంటారని తన ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి వేల కోట్ల రూపాయలు నిరుపేదల వైద్య సేవకు వెచ్చిస్తున్నారని పామర్రు శాసనసభ్యులు కుమార్ రాజా తెలిపారు. శుక్రవారం తోట్లవల్లూరు మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను పంపిణీ చేశారు. లబ్ధిదారులు సయ్యద్ అమీనా కు రు.45,905/- చెక్కును సింహాద్రి రాజేష్ బాబుకు రు.26,218/-పాముల చంటిబాబు రు.31,843/- యేమినేని శ్రీలక్ష్మి రు.30,786/- బడుగు నాగమణిరు.30,028/- చెక్కును లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు కుమార్ రాజా చేతుల మీదుగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షుడు వీరంకి వెంకట గురుమూర్తి, తోట్లవల్లూరు ఎంపీడీవోతోపాటు ప్రభుత్వ అధికారులు, సీనియర్ నాయకులు,కూటమి నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# అర్థమూరులో ఎంపీడీవో శివప్రసాద్ పనుల పరిశీలన



**బంటుమిల్లి,కలంకౌంటర్ :** బంటుమిల్లి మండలం అత్తమూరు పంచాయతీలో విబిజీ రామ్ జి పథకంలో జరుగుతున్న పనులను బంటుమిల్లి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శివప్రసాద్ శుక్రవారం పరిశీలించారు. ఆర్ఎంపీ రోడ్డు నుండి పి మస్తాన్ పోలం వరకు 125 మందితో చేస్తున్న పనులను ఆయన పరిశీలించారు కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు వారి హాజరును పరిశీలించారు అనంతరం ఆర్ వో ప్లాంట్ నందు మంచినీటి ప్యూరిఫై విధానాన్ని తీసుకొని జాగ్రత్తలను పరిశీలించి సూచనలు ఇచ్చారు మంచినీటిని టెస్టింగ్ నిమిత్తం శాంపుల్ బాటిల్ సేకరించారు. అలాగే ఎస్ డబ్ల్యూ పి పి షెడ్లను పర్యవేక్షించారు

# పిల్లలు తక్కువ... అటెండెన్స్ ఎక్కువ

- ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎమ్ ఎల్ ఏ ఇంటూరి
- తెట్టు హైస్కూల్ ఆకస్మిక తనిఖీలో వెలుగుచూసిన వైనం



**కందుకూరు,కలంకౌంటర్ :** గుడ్లూరు మండలం తెట్టులోని జిల్లా పరిషత్ హైస్కూల్ ను కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం ఉదయం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రతి క్లాస్ రూమ్, వంటగది పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. మధ్యాహ్నం భోజనం, మెనూ అమలు, ఇతర సౌకర్యాలపై వారినుంచి సమాధానాలు రాబట్టారు.ఒకటి నుంచి 9 తరగతుల వరకు 128 మంది విద్యార్థులు చదువుతుండగా, ఎమ్మెల్యే తనిఖీ సమయంలో 100 మంది లోపే ఉన్నారు. కానీ విద్యార్థులందరూ 100% హాజరైనట్లు అటెండెన్స్ వేసినట్లు ఎమ్మెల్యే గుర్తించారు. దీంతో ఆయన ఉపాధ్యాయులు, హెచ్ఎం చిన్నయ్య పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికీ అటెండెన్స్ ఎందుకు వేశారని నిలదీయడంతో టీచర్లు నీళ్లు నమిలారు.కొంతమంది పిల్లలు వచ్చి వెళ్లిపోయారని, మరి కొంతమంది ఇంకా రాలేదని... ఉపాధ్యాయులు పొంతన లేని సమాధానాలు చెప్పడంపై ఎమ్మెల్యే వారిని మందలించారు. ఎమ్మెల్యే నాగేశ్వరరావు వెంటనే డీఈవో బాలాజీరావుకు ఫోన్ చేసి, ఉపాధ్యాయుల తీరుపై ఫిర్యాదు చేశారు.ఇలాంటి విషయాలపై అప్పుడప్పుడు ఎందుకు తనిఖీ చేయడం లేదని పేరెంట్ టీచర్స్ అసోసియేషన్ చైర్మన్ రియాజ్, స్థానిక నేతలను ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇకనుంచి హైస్కూల్ లో పరిస్థితులను నిత్యం గమనిస్తూ ఉండాలని సూచించారు.

# ఉపాధి పనులను ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు..

**నాగాయలంక,కలంకౌంటర్ :** నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమం ద్వారా సత్ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కోరారు. శుక్రవారం నాగాయలంక మండలం ఎదురు-ుమొండి గ్రామంలో రాష్ట్ర ప్రభుత్వం భూగర్భ జలాలు పెంచేందుకు చేపట్టిన "జల ధార" నీటి భద్రత – సాగునీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో భాగంగా చేపట్టిన ఉపాధి పనులను ఎమ్మెల్యే పూజలు చేసి ప్రారంభించారు. గ్రామంలో భూగర్భ జలాలు పెంచేందుకు చేపట్టాల్సిన పనులు గుర్తించి అనుమతి పొందాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో డీసీ చైర్మన్ బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు (చినబాబు), ఎంపీడీఓ కే.చంద్రశేఖర్, నాయకులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.



# యువత సవాళ్లను స్వీకరించి ముందుకు సాగాలి

- ట్రెండ్ ను అనుసరించకుండా లక్ష్యంపై దృష్టిపెట్టాలి
- ఏం నేర్చుకున్నారన్నది కాదు.. ఎలా ఆలోచిస్తున్నారనేది ముఖ్యం
- షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం
- ఎవరూ చూడనప్పుడు మీరేం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం
- ఏపీ, విశాఖ అభివృద్ధిలో సత్వా గ్రూప్ భాగస్వామ్యం కాబోతోంది
- గ్రీన్ ఉడ్ హై సంస్థ గ్లోబల్ సిటిజన్స్ ను తయారుచేస్తుండటం గర్వకారణం
- బెంగళూరు గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఐబీడీపీ గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో మంత్రి నారా లోకేష్

(మొదటిపేజీ తరువాయి)

చేశా. ఏడాదిపాటు గ్రామాలు, పట్టణాలు, పొలాలు, వీధుల్లో నడిచా. రైతులు, మహిళలు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, చిరు వ్యాపారులు, మెకానిక్ లను కలిశా. ఆ ప్రయాణం నన్ను పూర్తిగా మార్చేసింది. ఎందుకంటే అప్పటి వరకు పాలనను వ్యవస్థ దృష్టితో చూశా. కానీ ఆ ప్రయాణంలో జీవితాన్ని ప్రజల దృష్టితో చూశా. ఆ రెండు చాలా భిన్నమైనవి. తర్వాత మరో అధ్యాయం ప్రారంభమైంది.

**మంగళగిరిలో గెలుపు ప్రజల నమ్మకానికి నిదర్శనం..** 2024లో జరిగిన ఎన్నికల్లో మంగళగిరి నియోజకవర్గం నుంచే తిరిగి పోటీ చేశా. అదే మంగళగిరి, అదే ప్రజలు. కానీ ఈసారి మరింత లోతైన అవగాహన, మరింత బలమైన నమ్మకంతో వెళ్లి విజయం సాధించాం. గెలవడమే కాదు... మంగళగిరిలో 91,413 ఓట్ల మెజారిటీ సాధించాం. ఇది రాష్ట్రంలో మూడో అత్యధిక మెజారిటీ. 1985 తర్వాత తెలుగుదేశం పార్టీ ఎప్పుడూ గెలవని నియోజకవర్గంలో ఇది జరిగింది. ఆ విజయం నాది కాదు. ప్రజల నమ్మకానికి నిదర్శనం. వినడానికి చేసిన ప్రయత్నానికి ఫలితం. ప్రజలతో నిజాయితీగా మమేకమైనప్పుడు మార్పు తప్పకుండా వస్తుందని నిరూపించింది.

**షార్ట్‌కట్‌ల ప్రపంచంలో నైతికతే గొప్ప బలం..** 'కొత్త అవకాశాలకు నాంది పలకడం' అంటే ఎప్పుడూ పూర్తిగా కొత్తదేదైనా సృష్టించడం మాత్రమే కాదు. కొన్నిసార్లు అది ఇతరులు చూడలేని దానిని చూడటం. ఇతరులు పట్టించుకోనప్పుడు వినటం, కూర్చోవడం సులభమైనప్పుడు నిలబడటం. నేను విద్యార్థులకు ఎప్పుడూ ఒక విషయం చెబుతా. ప్రముఖ ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు గారు అమ్మకు చెప్పలేని పని జీవితంలో ఎప్పుడు చేయవద్దని సూచించారు. మీ జీవితంలో ప్రతి నిర్ణయం ఈ పరీక్షను దాటితే.. మీరు ఎప్పుడూ తప్పుదారిలో వెళ్లరు. ఎందుకంటే ఈ షార్ట్‌కట్‌ల ప్రపంచంలో... నైతికతే మీ గొప్ప బలం.

**ఎవరూ చూడనప్పుడు మీరేం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం..** స్టాన్‌ఫోర్డ్‌లో మేము పరీక్షలు ఇన్విజిలేటర్లు లేకుండానే రాసేవాళ్లం. ఎవరూ గమనించేవారు కాదు. కూర్చొని పరీక్ష



రాసి బయటకు వచ్చేవాళ్లం. అప్పుడు నిజాయతీ తప్ప చీటింగ్ చేయకుండా ఎవరూ ఆపలేరు. ఆ విధమైన వ్యవస్థ మా జ్ఞానాన్ని కాకుండా వ్యక్తిత్వాన్ని పరీక్షించింది. ఆ పాఠం నాకు జీవితాంతం గుర్తుండిపోయింది. ఎవరూ చూడనప్పుడు మీరు ఏం చేస్తారో అదే మీ వ్యక్తిత్వం. ఇంకో ఆసక్తికరమైన పద్ధతి కూడా ఉండేది. మాకు ఒక బోర్డు ఉండేది. అందులో విద్యార్థులు తాము ఏ విషయం గురించి తెలుసుకోవాలనుకుంటున్నారో బోర్డుపై రాసేవారు. ఉదాహరణకు నాకు ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌పై ఆసక్తి ఉంటే, అక్కడ రాస్తాను. అప్పుడు ఇంకొకరు వచ్చి మనిద్దరం కలిసి నేర్చుకుందాం అంటారు. అదే కలిసి పనిచేయడంలో, నేర్చుకోవడంలో ఉన్న శక్తి. గ్రీన్‌వుడ్ హై వంటి సంస్థల్లో మీ-రు నిర్మించుకునే బంధం అదే.

**విద్యార్థులు నైతిక విలువలు అలవర్చుకోవాలి..** ఈ రోజు మీరు అడుగుపెడుతున్న ప్రపంచం ఇంతకు ముందెన్నడూ లేనంత వేగంగా మారుతోంది. సాంకేతికత రోజురోజుకీ అభివృద్ధి చెందుతోంది. ఉద్యోగాలు మారుతున్నాయి. పరిశ్రమలే మారిపోతున్నాయి. మీరు భవిష్యత్తులో చేసే కొన్ని ఉద్యోగాలు.. ఈ రోజు ఇంకా లేవు కూడా. అయితే మీకు పరిస్థితులకు అనుగుణంగా మారగల సామర్థ్యం, కష్టాలను ఎదుర్కొని మళ్లీ నిలబడగలికే ధైర్యం, తెలుసుకోవాలనే ఆసక్తి, నైతిక విలువలు అవసరం. ఎందుకంటే జ్ఞానం మారుతుంది కానీ ఈ విలువలు మాత్రం మారవు.

**ప్రపంచ పౌరులను తయారు చేసే పాఠశాల ఇది...** ఈ రోజు తల్లిదండ్రుల రోజు కూడా. ప్రతి విజయవంతమైన విద్యార్థి వెనుక త్యాగం, సహనం, నిస్వార్థమైన మద్దతు ఉంటుంది. ఉపాధ్యాయులు భవిష్యత్ నిర్ణేతలు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా జీవితాలను తీర్చిదిద్దుతారు. గ్రీన్‌వుడ్ హై ఒక అద్భుతమైన సంస్థను నిర్మించింది. జ్ఞానం, జీవన నైపుణ్యాలు, మీలాంటి ఆత్మవిశ్వాసంతో కూడిన ప్రపంచ పౌరులను తయారు చేసే పాఠశాల ఇది. ఈ రోజు డిప్లొమాను అందుకునే విద్యార్థులు.. రేపు మీరు మీ బాధ్యతను అందుకుంటారు. మీ కుటుంబం, సమాజం, దేశం పట్ల బాధ్యతగా ఉండాలి. మీరు ముందుకు సాగే క్రమంలో మూడు విషయాలు గుర్తుంచుకోవాలి. పెద్ద కలలు కనండి, కానీ నేల మీదే ఉండండి. కష్టపడండి, కానీ నైతిక విలువలను విస్మరించవద్దు. విజయాలు సాధించండి కానీ ఇతరులను కూడా మీతో తీసుకెళ్లండి. ఎందుకంటే నిజమైన విజయం అనేది మీరు ఒంటరిగా సాధించేది కాదు.. ఇతరులకు మీరు సృష్టించే అవకాశమే. 2026 బ్యాచ్ విద్యార్థులు కేవలం గ్రాడ్యుయేట్లు మాత్రమే కాదు... మార్గదర్శకులు. అడ్డంకులను ఛేదించి ముందుకు సాగాలని ఈ సందర్భంగా మంత్రి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సత్వ గ్రూప్ ఎండీ, గ్రీన్‌ఉడ్ హై ఇంటర్నేషనల్ స్కూల్ ఛైర్మన్ బిజయ్ అగర్వాల్, ప్రిన్సిపల్ షీలా అలెగ్జాండర్, వైస్ ప్రిన్సిపల్ నిషాంత్ నగవర్, మేనేజింగ్ ట్రస్టీ శ్రీమతి నీరు అగర్వాల్, ట్రస్టీ ఎన్.మెహ్రోత్ర, ఐబీడీపీ కోఆర్డినేటర్ ఎస్.కావ్య తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌డీఏ, ఎన్ఏ, సీడీఎస్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- లోటుపాట్లకు తావులేకుండా సౌకర్యాల కల్పన
- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ




**విజయవాడ, కలంకౌంటర్ :** ఈ నెల 12న జరిగే నేషనల్ డిఫెన్స్ అకాడమీ (ఎన్‌డీఏ), నేవల్ అకాడమీ; కంబైన్డ్ డిఫెన్స్ సర్వీస్ (సీడీఎస్) పరీక్షల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. పరీక్షల నిర్వహణకు ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పించాలని సమన్వయ శాఖల అధికారులను ఆదేశించారు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ద్వారా నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నేవల్ అకాడమీ, కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ పరీక్షల నిర్వహణపై శుక్రవారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో లైజన్ ఆఫీసర్లు, వెన్యూ సూపర్వైజర్లు, సమన్వయ శాఖల అధికారులతో కలెక్టర్ లక్ష్మీశ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల12వ తేదీ ఆదివారం విజయవాడలోని ఏడు కేంద్రాల్లో పరీక్షలు జరగనున్నట్లు తెలిపారు. సీడీఎస్‌కు 699 మంది, ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు 2,101 మంది మొత్తం 2,800 అభ్యర్థులు పరీక్షలు రాసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు. సీడీఎస్‌కు సంబంధించి ఉదయం 9 గం. నుంచి 11 గం. వరకు సెషన్-1, మధ్యాహ్నం 12.30 గం. నుంచి 2.30 గం. వరకు సెషన్-2, సాయంత్రం 4 గం. నుంచి 6 గం. వరకు సెషన్-3 జరగనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ఎన్‌డీఏ అండ్ ఎన్ఏకు సంబంధించి సెషన్-1 ఉదయం 10 గం. నుంచి మధ్యాహ్నం 12.30 గం. వరకు సెషన్-2 మధ్యాహ్నం 2 గం. నుంచి సాయంత్రం 4.30 గం. వరకు జరుగుతుందని వివరించారు. భద్రతకు సంబంధించి పోలీసు శాఖ ఏర్పాట్లు చేయాలని.. అదేవిధంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం లేకుండా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద వైద్య ఆరోగ్య శాఖ వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని.. వేసవి నేపథ్యంలో అభ్యర్థులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని, తాగునీటిని అందుబాటులో ఉంచాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. సమావేశంలో పరీక్షల స్టేట్ అబ్జర్వర్ ప్రేమ్ కుమార్ లకావత్, యూపీఎస్సీ ఇన్‌స్పెక్టింగ్ ఆఫీసర్ సుమిత్ వర్మ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, విజయవాడ ఆర్డీవో టీవీ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# రాయలసీమ ప్రాజెక్ట్ ను వైసిపి రాజకీయంగా వాడుకోవాలని చూడటం హేయం

- రాయలసీమపై ప్రేమ ఉన్నట్టు మరోసారి రాజకీయం చేయాలని చూస్తుంది.
- మీ హాయాంలోనే ఎన్జీటీ ఆదేశాలతో రాయలసీమ ప్రాజెక్ట్ ఆగిపోయింది కాదా..
- రాయలసీమకు రూ.40 వేల కోట్లతో హార్టీకల్చర్ హబ్ తీసుకువస్తున్నాము.
- ఒకే ఏడాదిలోనే హంద్రీనీవా ప్రాజెక్ట్ కు నిధులు కేటాయించి పనులు కూడా పూర్తి చేసిన ఘనత మాది.
- రాయలసీమ అభివృద్ధికి మీ హాయాంలో ఎంత ఖర్చు పెట్టారో చర్చకు సిద్ధం.
- తుంగభద్ర డ్యాం గేట్లు వర్షాలు వచ్చే లోపు పూర్తిగా బిగిస్తాము.
- రాయలసీమ మీద ఇప్పుడు ప్రేమ ఉన్నట్టు వైసీపీ నాయకులు మొసలి కన్నీరు కార్చుతూ మీటింగ్ లు పెడుతున్నారు.

**అమరావతి,కలంకౌంటర్ :** ఆర్థిక,ప్రణాళిక,వాణిజ్య పన్నుల శాఖామాత్యులు పయ్యావుల కేశవ్ ఎద్దేవ చేశారు.ఏపీ సచివాలయంలోని ప్రచార విభాగంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల మాట్లాడుతూ నేడు రాయలసీమ మీద అవ్యాజ్యప్రేమ చూపుతున్న వైసిపి నాయకులు అధికారంలో ఉన్న 5 ఏళ్లలో రాయలసీమకు ఏం చేశారని ప్రశ్నించారు.కనీసం కాల్వల్లో తట్ట మట్టి తీశారా.కనీసం కొట్టుకుపోయిన అన్నమయ్య డ్యాం వైపు తిరిగి చూశారా.. రాయలసీమ ప్రాజెక్ట్ ను చంపింది మీరు కాదా అని నిలదీశారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ ఎన్జీటీ ఆదేశాలతో మీ హాయాంలోనే ఆగిపోయిందని, మరి అలాంటప్పుడు ఆగిపోయిన ప్రాజెక్ట్ ను మళ్లీ మేము ఎలా ఆపగలమని ప్రశ్నించారు.బట్టకాల్చి మీద వేసే బుద్ధి ఉన్న మీ-రు మారరు అని విమర్శించారు. తెలంగాణా సభలో అప్పటి మంత్రి హరీష్ రావు రాయలసీమ ప్రాజెక్ట్ ను ఆపింది మేమే అని చెప్పలేదా అని నిలదీశారు. గతంలో వైఎస్సార్ సీఎం గా ఉన్న సమయంలో మిగులు జలాల్లో వాటా అడగము అని రాసి ఇవ్వలేదా అని నిలదీశారు. మాజీ సియం జగన్ హాయాంలో చీఫ్ సెక్రటరీ, ఈఎన్సీ రాయలసీమ ప్రాజెక్ట్ పై ఏమని వ్రాసారో తెలుసా.. రాయలసీమ ప్రాజెక్ట్ అసలు ఇరిగేషన్ ప్రాజెక్ట్ కాదు మేము కేవలం స్టడీ చేస్తున్నామని రాయలేదా.. ఆ అఫిడవిట్లు చూపమంటారా.. ప్రజలను మళ్లీ మోసం చేయడానికి మీరు ఎప్పుడూ రాజకీయం కోసం రాయలసీమను వాడుకునే విధంగా మరోసారి రాజకీయం చేస్తున్నారన్నారు. ఎన్టీయార్ హాయాంలో గాలేరు నగరి, హంద్రీనీవా, తెలుగుగంగ ఈ మూడు ప్రాజెక్ట్ లు ప్రారంభమయ్యాయని



మంత్రి అన్నారు. నేడు రాయలసీమ సస్యశ్యామలానికి ఈ మూడు ప్రాజెక్ట్ లు కారణం కాదా అని అన్నారు. కాని మీరు ఇన్ని సంవత్సరాల్లో రాయలసీమకు చుక్క నీరందించారా అని ప్రశ్నించారు. జగన్ మోహన్ రెడ్డి ఈ మూడు ప్రాజెక్ట్ లకు ఏం చేశారు.. రాయలసీమ అభివృద్ధికి ఎంత ఖర్చు పెట్టారో చర్చకు రావాలని సవాల్ విసిరారు. అదే మా పాలనలో ఒక్క సంవత్సరంలోనే హంద్రీనీవా ప్రాజెక్ట్ కు రూ. 3,700 కోట్లు ఖర్చు చేశామన్నారు. ఒకే సంవత్సరంలో కేటాయింపులు, ఆదే సంవత్సరంలో పనులు ప్రారంభించి పూర్తి చేయడం జరిగిందని ఇది చరిత్రలో ఒక రికార్డు అని అన్నారు. అంతే కాకుండా మ-రో రూ. 2వేల కోట్లు ఖర్చు చేయనున్నామని తెలిపారు. మీ హాయాంలో ఐదేళ్లలో మీరు రాయలసీమ పేరు పలకడానికి కూడా సాహసించలేదని, కాని మేము రూ. 40వేల కోట్లతో రాయలసీమ హార్టీకల్చర్ హబ్ పెడతామని, రాయలసీమను అభివృద్ధి చేసి చూపిస్తామన్నారు. రాయలసీమ పై మీ మొసలి కన్నీరు కార్చితే నమ్మడానికి ప్రజలు సిద్ధంగా లేరన్నారు. రాయలసీమ ప్రాజెక్ట్ కంటే తక్కువ ఎత్తులో ముచ్చుమర్రి ఎత్తిపోతల పథకం మేము పూర్తి చేశాము కదా.. మళ్లీ రాయలసీమ ప్రాజెక్ట్ ఎందుకన్నారు. ఎటువంటి అభ్యంతరాలు లేకుండా ముచ్చుమర్రి పథకం పనిచేస్తుంది.. అన్ని అనుమతులు తెచ్చాము కదా అని మంత్రి వివరించారు. కేవలం వివాదం, ప్రాంతాల మధ్య విద్వేషాలు సృష్టించడానికి ఇటువంటి చర్యలకు దిగుతున్నారని విమర్శించారు. మీ పాలనలో రాయలసీమ ప్రాజెక్ట్ పై స్టే విధిస్తే మీరు ఏం చేశారని కనీసం ఒక్క ప్రయత్నం కూడా చేయలేదు అని విమర్శించారు. ప్రక్క రాష్ట్రంలోని తుంగభద్ర డ్యాం గేట్లు కొట్టుకుపోతే తక్షణం స్పందించామని, గేట్లు పెట్టడానికి కుదరదు అన్న పరిస్థితి నుండి దేశంలోనే నిపుణులను తీసుకువచ్చి పంట నష్టపోకుండా చర్యలు తీసుకోగలిగామన్నారు. ఇప్పటికే 33 గేట్లలో 18 గేట్లు మూడు నెలల్లోనే బిగించడం జరిగిందని,వర్షాలు వచ్చే లోపు మిగిలిన గేట్లు కూడా బిగిస్తామన్నారు. రాయలసీమకు మీరు దగా చేశారని, రాయలసీమను వాడుకుని వదిలివేసింది ఒక్క జగన్ మాత్రమే అని అన్నారు. ఉరవకొండ జలదీక్ష సమయంలో మూడు నెలల్లో హంద్రీనీవా పూర్తి చేస్తామని హామి ఇవ్వాలేదా మరి ఐదేళ్ల కాలంలో ఒక్క రూపాయి ఖర్చు చేయలేదని ఎద్దేవ చేశారు. మీ కడుపు మంటను రైతుల కన్నీళ్లుగా మార్చవద్దని మంత్రి హితవు పలికారు.

Printed,Published and owned by Chitta Vasavidevi Printed at Rama Offset Printers, 7th ward, Ponnuru, Guntur District-522 124 Andhra Pradesh and Published at 7th ward, Ayyappa Nagar, Ponnuru-522 124, Guntur District. Andhra Pradesh. Editor : Chitta Vasavidevi. RNI No.APTEL/2016/69464, Phone No.9346935672, kalamcounter@gmail.com